కేసీఆర్‌కు ప్రజలు అండగా నిలవాలి

- మంత్రి గంగుల కమలాకర్
- నాలుగున్నరేళ్లు ఎంపీగా బండి సంజయ్ ఏంచేశాడో నిలదీయాలి



గోపాల్‌పూర్‌లో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి: ఎంపీగా నాలుగున్నరేళ్లు బండి సంజయ్ ఏంచేశాడో నిలదీయాలని కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్ మండలం గోపాల్‌పూర్, ఎలబోతారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి హాస్పిటల్ డ్రామాలాడే పెద్ద ఆర్టిస్ట్ బండి సంజయ్ అని, ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు సేవ చేయకుండా కన్పించకుండా పోయాడని ఆరోపించారు. గతంలో తెలంగాణను అన్యాయంగా ఆంధ్రాలో కలిపింది కాంగ్రెస్ పార్టీయేనని, బీజేపీ, కాంగ్రెస్‌లకు ఆంధ్రోళ్లు అండగా ఉన్నారని, సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా నిలిచి గెలిపించాలని కోరారు. పదేళ్లలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులపై చర్చించి బీఆర్ఎస్‌కు ఓటేయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఎలబోతారంలో కొందరు మహిళలు రేషన్‌కార్డులు, పింఛన్లు, దళితబంధు ఇవ్వాలని కోరగా ఎన్నికలు ముగిసిన తర్వాత వెంటనే ఇస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అంతకు ముందు దళితబంధుపై మంత్రిని నిలదీస్తారనే సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు కొంత మంది యువకులను అదుపులోకి తీసుకొని వేరే ప్రాంతానికి తరలించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ టి.లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ వి.నారాయణ, సర్పంచులు మంజుల, లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రామక్క, ఉపసర్పంచులు శ్రీకాంత్, సంపత్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పి.శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగుల కుటుంబ సభ్యుల ప్రచారం

మంత్రి గంగుల కమలాకర్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ సోమవారం నగరంలోని 19వ డివిజన్ పరిధిలోని విజయపురికాలనీ, అంబేద్కర్ కాలనీ, స్వామికాలనీ, సింహాద్రికాలనీ, షేకాబీకాలనీ, హిల్స్ కాలనీల్లో గంగుల సోదరుడు సుధాకర్, కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఎదుల్ల రాజశేఖర్ మాట్లాడుతూ.. శివారుప్రాంత కాలనీల అభివృద్ధి కోసం అనతి కాలంలోనే మౌలిక వసతుల కల్పనకు వేల కోట్ల రూపాయలు వెచ్చించిన కమలాకర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కత్తెర పాక ఆంజనేయులు, జనరల్ సెక్రటరీ అస్తపురం తిరుపతి, నాయకులు రెడ్డ వేణి తిరుపతి, రాచకొండ నరేశ్ ,గడ్డం దామోదర్, పర్వతం తిరుపతి, నూనె కనకయ్య, కొలిపాక శ్రీనివాస్, పెందోట వామనాచారి, లింగంపల్లి వెంకటేష్, బబ్లు, జావిద్, గూడూరి ఆంజనేయులు, కుంబాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న గంగుల కుటుంబ సభ్యులు

గ్రానైట్ అసోసియేషన్ ప్రచారం

కొత్తపల్లి: గంగుల కమలాకర్‌ను గెలిపించాలని కోరుతూ కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలో గ్రానైట్ కట్టింగ్ మిషన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.శంకర్ ఆధ్వర్యంలో గ్రామశాఖ అధ్యక్షుడు శంకర్, మాజీ సర్పంచ్ ప్రకాశ్ తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటు వేయాలని అభ్యర్థించారు. అదేవిధంగా కొత్తపల్లి పట్టణంలోని 1, 12 వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్లు వాసాల రమేశ్, వేముల కవితచంద్రశేఖర్ ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.



కొత్తపల్లి: ఎలగందులలో ప్రచారం చేస్తున్న గ్రానైట్ అసోసియేషన్ నాయకులు

అవినీతిని అంతమొందించేందుకే పోటీ

- కేంద్ర మంత్రి పదవి ఇస్తానంటే వద్దన్న
- కరీంనగర్‌లో మార్పు వస్తేనే న్యాయం
- కరీంనగర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



కిసాన్‌నగర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్, హాజరైన ప్రజలు

కరీంనగర్‌టౌన్: 'ప్రజల కోసం జైలుకెళ్లిన.. కేంద్ర మంత్రి పదవి ఇస్తానంటే వద్దని ప్రజల కోసం పోరాడుతున్నా... నీలెక్క అవినీతి చేయడానికి అధికారంలో ఉన్నానా? భూకబ్జాలు చేసి ప్రజలను దోచుకున్నానా? నాలుగేళ్లు పోరాటాలు చేశాను. నువ్వా నా గురించి మాట్లాడేది' అంటూ కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ మంత్రి గంగుల కమలాకర్ ధ్వజమెత్తారు. రేషన్‌కార్డులు, ఇళ్లు, ఉద్యోగాలు ఇవ్వకుంగా ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తున్నారో నిలదీయండి అంటూ పిలుపునిచ్చారు. అవినీతి మరక వేస్తూ బీఆర్ఎస్ నేతలు బూతులు తిడుతున్నారు, పేదల కోసం జైలుకు పోవడమే తప్పా? కరీంనగర్‌కు రూ.9 వేల కోట్లు తేవడమే తప్పా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌లో ప్రచారం చేసిన బండి సంజయ్‌కు గాంధీ విగ్రహం వద్ద ప్రజలు ఘనస్వాగతం పలికారు. విశ్వకర్మ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది విశ్వకర్మ సంఘం నాయకులు బీజేపీలో చేరారు. స్మార్ట్ సిటీ, ఆర్వోబీ, రోడ్లకు నిధులు తెచ్చిన బహిరంగ చర్చకు సిద్ధమా? నేను అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే.. అవినీతికి పాల్పడుతున్నానటా.. అందుకే ఎంపీ టిక్కెట్ ఇవ్వలేదని చెబుతున్నాడు.. గంగులను చూస్తే నవ్వొస్తుంది.. ప్రజా సమస్యలపై పోరాడుతుంటే.. కేసీఆర్, గంగుల కలిసి నాపై దాడి చేసి జైలుకు పంపారు. మీ కోసం కొట్లాడితే, సర్కార్‌ను నిలదీస్తే కేసీఆర్ నాకిచ్చిన గిఫ్ట్ 74 కేసులు, మీ కోసం కొట్లాడేది ఎవరో.. మిమ్ముల్ని మోసం చేసి దోచుకునేదెవరో ఆలోచించి ఓటేయండి...కమలం గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యవేదిక సంఘం జిల్లా అధ్యక్షులు పాములపర్తి వేణుగోపాలాచారి ఆధ్వర్యంలో 200 మంది నాయకులు ఘన స్వాగతం పలికారు. బండి సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఐక్యవేదిక నాయకులు సామనపల్లి లక్ష్మీ, శంకరాచారి, కరీంనగర్ అర్బన్ అధ్యక్షులు గర్రెపల్లి శ్రీనివాస్, జిల్లా అధికారప్రతినిధి లక్ష్మీనారాయణ, గుగ్గిళ్ల చంద్రమౌళి బీజేపీలో చేరిన వారిలో ఉన్నారు.

అన్నివర్గాలను దృష్టిలో ఉంచుకొని మేనిఫెస్టో

బీజేపీ అన్నివర్గాలను దృష్టిలో ఉంచుకొని మేనిఫెస్టో రూపకల్పన చేసిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీఎస్‌పీఎస్సీ బోర్డు మాజీ సభ్యులు విట్టల్ తెలిపారు. కరీంనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యం, బీసీ ముఖ్యమంత్రి, ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఆ దిశగా పనిచేస్తుందన్నారు. రాష్ట్రం రూ. 5 లక్షల కోట్ల అప్పుల పాలైందని, కొత్తగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రకటించిన పథకాలకు దాదాపు రూ.70 వేల కోట్లు అవసరమవుతాయన్నారు. జీతాలకే ఇబ్బంది పడుతున్న రాష్ట్రంలో స్కీమ్‌లు ఎలా కొనసాగిస్తారో చెప్పకుండా అధికారం కోసం పాకులాడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసాలను ప్రజలు గ్రహించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంద్ర నళిని, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి , దండు కొమరయ్య ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ , మాడ వెంకటరెడ్డి, గుర్రాల వెంకట్ రెడ్డి, బొంతల కళ్యాణ్ చంద్ర, కటకం లోకేష్, బండ రమణారెడ్డి, కార్పొరేటర్ లు రాపర్తి విజయ, బండ సుమ, దుర్శెట్టి అనూప్ పాల్గొన్నారు.

భూకబ్జాదారులకు గుణపాఠం చెప్పాలి

భూకబ్జాదారులు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బండి సంజయ్‌కుమార్ కోరారు. కరీంనగర్ మండలం జూబ్లీనగర్‌లో ప్రచారం నిర్వహించారు. గంగులను మూడుసార్లు గెలిపిస్తే భూములు కబ్జాచేసి గుట్టలను ధ్వంసం చేశాడు, కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్‌ది భూకబ్జాల పంచాయతీ. ఎంపీగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నా, అవినీతికి పాల్పడితే అధికారంలో ఉండి ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. నా ఆస్తిపాస్తుల డాక్యుమెంట్లను గంగుల తీసుకొస్తే ప్రజలకు పంచుతా, నీ ఆస్తులు ప్రజలకు పంచే దమ్ముందా అని సవాల్ విసిరారు. ధర్మం కోసం పోరాడుతున్న బీజేపీకి ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.శివరామకృష్ణ, నళిని, డి.శ్రీనివాస్, రమణారెడ్డి, కె. మురళి, ఎం.సంతోష్‌కుమార్, శివారెడ్డి, కుమార్ పాల్గొన్నారు.



భగత్‌నగర్ సమీపంలో..



సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన విశ్వకర్మలు

క్లుప్తంగా


డబ్బుల పంపిణీ అడ్డుకోవాలని ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్

కరీంనగర్‌కార్పొరేషన్: జరగబోయే అసెంబ్లీలో ఎన్నికల్లో మహిళా సంఘాల ద్వారా డబ్బులు పంపిణీని అడ్డుకోవాలని 49వ డివిజన్ కార్పొరేటర్ సర్దారిని కమల్‌జిత్‌కౌర్ సోహన్‌సింగ్ అన్నారు. ఈమేరకు రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. నిష్పక్షపాతంగా జరగాల్సిన ఎన్నికల్లో మహిళా సంఘాల ద్వారా డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, పేద, మధ్యతరగతి ప్రజలకు డబ్బు, మద్యం, యువతకు సెల్‌ఫోన్‌ల ఆశ చూపి ఓట్లు వేయించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, వీటిని నిరోధించాలని, అలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నియామకం



నియామకపత్రం అందిస్తున్న నాయకులు

కరీంనగర్‌కార్పొరేషన్: పట్టణ కాంగ్రెస్ మైనార్టీ సెల్ 13వ డివిజన్ అధ్యక్షుడిగా గోదాంగడ్డకు చెందిన సయ్యద్‌బారి నియామకమయ్యారు. ఈమేరకు సోమవారం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్, నగర అధ్యక్షుడు సయ్యద్ ఖాజాసైఫుద్దీన్ అఖిల్ నియామక ఉత్తర్వులు అందచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం.ఎ.నవాజ్, ములుగు ప్రకాశ్, నేహాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ఎంపిక పోటీలు



మానకొండూర్: మండలంలోని అన్నారం జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో క్రీడాసమాఖ్య -17 క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 250 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీఈటీలు శ్రీనివాస్ రావు, సత్యనారాయణ, హనుమంతు, రాజాబాబు, ప్రేమలత పాల్గొన్నారు.

యువతతో ఏదైనా సాధ్యమే

- ఓటుహక్కు వజ్రాయుధం.. సక్రమంగా వినియోగించుకోవాలి
- 30న ఓటేయాలని ప్రైవేటు స్కూళ్ల మహిళా ఉపాధ్యాయుల పిలుపు

సాక్షి యూత్ ఎజెండా



సప్తగిరికాలనీ(కరీంనగర్): సమాజంలో మార్పును తీసుకొచ్చి జాతి భవిష్యత్‌ను మార్చగల సత్తా యువతకే ఉంది. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రజలకాంక్ష, అభివృద్ధికి పాటుపడే వారినే సమాజం ముందు నిలబెట్టేది రాబోయే అసెంబ్లీ ఎన్నికలు. 30న జరిగే ఎన్నికల్లో యువత ప్రలోభాలకు లొంగకుండా మంచి అభ్యర్థులను ఎన్నుకునేందుకు సమాయత్తం కావాలి.. నిరుద్యోగులకు ఉపాధి, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యలు తీర్చగల అభ్యర్థులకే ఓటేయాలని జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు వారి అభిప్రాయాలను 'సాక్షి'తో వెలిబుచ్చారు.

నోటుకు ఆశపడొద్దు



ప్రజాసమస్యలపై స్పందించి పరిష్కరించే వారికే ఓటేయండి. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేసిన వారిని ఎన్నుకోండి. ప్రస్తుత, గత రాజకీయాలకు చాలా తేడా ఉంది. ఓటును నోటుతో కొనాలన్నది నేటి రాజకీయం. ఓటు వజ్రాయుధం, నోటుకు ఆశపడకుండా ఓటేయాలి. – జి. సరితారెడ్డి

ఆలోచించి ఓటేయాలి



ఐదేళ్లకు ఒకసారి వినియోగించే ఓటు నిజాయితీపరులను ఎన్నుకునే విధంగా ఉండాలి. గెలిచిన అభ్యర్థులు ఇచ్చిన హామీలను నెరవేర్చే నాయకులను ఎన్నుకోండి. ఓటు వేసే ముందు మన అభివృద్ధిని ఆకాంక్షించే వ్యక్తి ఎవరో చూడాలి. నేను నిజాయితీపరుడను అనీ ప్రతి ఒక్కరూ చెబుతుంటారు. కానీ మనం ఆలోచించి ఓటేయాలి. – జి. మాలతి రెడ్డి

ఓటుతో బుద్ధి చెప్పాలి



నిస్వార్థంతో పనిచేసే వ్యక్తికే ఓటేయ్యాలి. కుటుంబం, బంధు ప్రీతి అనే భావన ఉండకూడదు. నియోజకవర్గ ప్రజలంతా తన కుటుంబంగానే భావించాలి. పదవులు పొందే అవకాశం వచ్చిందని ప్రజల బాగోగులు పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా స్వార్థంతో పనిచేసే వారికి మీ ఓటుతో బుద్ధి చెప్పాలి. – బి. అనితారాణి

రాజకీయాల్లో మార్పు రావాలి



మీరు వేసే ఓటు ప్రస్తుత రాజకీయాల్లో మార్పు తీసుకొచ్చే విధంగా ఉండాలి. ప్రజల మంచి కోసం పాటు పడే వారికి ఓటేయండి. ఓటు మనకు వజ్రాయుధం లాంటిది. మంచి నాయకులను ఎన్నుకునేందుకు ఇది సువర్ణావకాశం. అభివృద్ధికి పాటు పడే వ్యక్తికి ఓటేసి సరికొత్త రాజకీయాలకు నాంది పలికే విధంగా ఉండాలి. – పి. రమ్యారెడ్డి

మాట తప్పనివారిని ఎన్నుకోండి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి వాటిని అమలు చేసే విషయంలో మాట తప్పని వారికి ఓటు వేయాలి. ఓట్ల కోసం అమలుకాని హామీలను గుప్పిస్తున్న వారికి ఓటువేసే ముందు నేటి యువత ఒక్కసారి ఆలోచించాలి. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిన వారినే ఎన్నుకోవాలి. – వి. శాంతి

సంక్షేమమే బాధ్యతగా తీసుకోవాలి



పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే బాధ్యతగా తీసుకునే నాయకులకే ఓటేయాలి. రాష్ట్రంలో పేదప్రజలకు ప్రయోజనం కలిగించే విధంగా ప్రణాళికలు రూపొందించే వారినే గెలింపించాలి. విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చే వారిని ఎన్నుకోవాలి. అలాంటి వారికే మనం ఓటేయాలి. – ఎస్. మీన

ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన నేతలు



సీఎంకు జ్ఞాపిక అందిస్తున్న ఎంపీపీ కేతిరెడ్డి వనిత

తిమ్మాపూర్: ప్రజాఆశీర్వాద సభలో పాల్గొనేందుకు తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌కు వచ్చిన సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, ఎంపీపీ వనితారెడ్డి హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎల్పీ సెక్రెటరీ మాదాడి రమేశ్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ రామకృష్ణ, జెడ్పీటీసీ శైలజ జితేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ప్రసాదం అందజేత..

హెలిక్యాప్టర్ నుంచి శ్రీచైతన్య కళాశాలలోని ప్రజాఆశీర్వాద సభా వేదికకు వచ్చిన సీఎంకు ఎంపీపీ కేతిరెడ్డి వనితారెడ్డి బొట్టు పెట్టి వేంకటేశ్వరస్వామివారి ప్రసాదం అందించారు. పలువురు మహిళా నేతలు సీఎంను కలిశారు.

మద్యం దుకాణాన్ని మార్చాలి

చొప్పదండి: పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయం సమీపంలో ఉన్న మద్యం దుకాణాన్ని మార్చాలని స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. మద్యంషాపు కారణంగా స్థానికులు గ్రంథాలయానికి వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారని, రోడ్డు పక్కన మహిళలు బయటకు రావడానికి భయపడుతున్నారన్నారు. ఇళ్లకు దూరంగా దుకాణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

కార్తీకమాసం పూజలు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో కార్తీక మాసం పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, తులసి మొక్కల వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. పాతబజార్ గౌరీ శంకరాలయం, కమాన్‌రోడ్ రామేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి.

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మగువ కిట్టీ ఆధ్వర్యంలో కార్తీక మాసం పురస్కరించుకొని వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. శివుడు, ఉసిరిచెట్టును పూజించి వన భోజనం చేశారు. కిట్టీ నిర్వాహకులు చకిలం స్వప్న, శ్వేత, రాధ, ఝాన్సీ, శాలిని, సాహితి, కృష్ణవేణి, ప్రవళిక, సంధ్య, లావణ్య, లక్ష్మి పాల్గొన్నారు.





గౌరీశంకర్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో స్వామివారు



వనభోజనాల్లో మహిళలు

గుట్టుగా మట్టి తవ్వకాలు

కొత్తపల్లి: మండలంలోని చింతకుంట పంచాయతీ శివారులోని మానేరు వాగులో మట్టి దందా కొనసాగుతోంది. కమాన్‌పూర్ గుట్టపై తవ్వకాలు చేపడుతున్న అక్రమార్కుల కన్ను ఇప్పుడు చింతకుంటలోని మానేరు వాగుపై పడింది. గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళ మట్టిని తోడుతూ అక్రమ రవాణా చేస్తున్నారు. మేకలు, పశువుల కాపరులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పద్మనగర్–ఎలగందుల రోడ్డు నిర్మాణంలో భాగంగా మానేరులో కొంతభాగాన్ని మేకలు, పశువులు మేతకు వదిలివేశారు. ఉదయం కాపరులు అడ్డుకుంటారని రాత్రి వేళ మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కమాన్‌పూర్ గుట్టలను తవ్వుతున్నా..మానేరు మట్టిని ఎత్తుకెళ్లినా ఏ ఒక్క అధికారి స్పందించడం లేదన్న విమర్శలు వెలువడుతున్నాయి. ఎన్నికల సమయం అదునుగా దందా జోరుగా సాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధి కారులు స్పందించి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని చింతకుంట గ్రామస్తులు కోరుతున్నారు.



చింతకుంట శివారు మానేరువాగులో మట్టితవ్వకాలు